ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 10 నవంబరు 2025



రేపు జాతీయ విద్యా దినోత్సవం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం మైనారిటీ వెల్ఫేర్ డే, జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆయా శాఖల విభాగాధిపతులు తప్పకుండా హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

వైభవంగా బాలియాత్ర

- వంశధార నదిలో తెప్పోత్సవం
- దీపాలు విడిచిపెట్టిన ఎమ్మెల్యేలు



వంశధార నదిలో దీపాలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యేలు రమణమూర్తి, రవికుమార్ తదితరులు



శ్రీముఖలింగేశ్వరాలయం నుంచి వంశధార నదికి వెళ్తున్న భక్తులు

జలుమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)

శ్రీముఖలింగేశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం బాలియాత్ర వైభవంగా జరిగింది. శ్రీముఖలింగేశ్వరాలయం నుంచి వంశధార నది వరకు ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, బెందాళం అశోక్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు బాలియాత్ర నిర్వహించారు. వంశధార తీరంలో తెప్పోత్సవం నిర్వహించారు. అరటి తెప్పల్లో దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. ముందుగా శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణ మూర్తి మాట్లాడుతూ.. బాలియాత్ర తెప్పోత్సవంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. ఐదు వేల సంవత్సరాల తరువాత, రాజులు కాలం నాటి బాలియాత్రను మళ్లీ నిర్వహించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడిందన్నారు. దీనికి కృషిచేసిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాశీబుగ్గ డీఎస్పీ డి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జడ్పీ ఛైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో బి.చిన్నమ్మడు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- కిటకిటలాడిన ఆలయం
- ఒక్కరోజు రూ.10.76లక్షల ఆదాయం

7లో

నేటి నుంచి సమ్మెటివ్ పరీక్షలు
- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

7లో

క్రీడల్లో మెరిశారు..
- రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

7లో

పిక్నిక్ సందడి
- పర్యాటకులతో కళకళలాడిన సముద్ర తీరాలు

8లో

టీకా.. ఆరోగ్యానికి రక్ష

- గర్భిణులు, పిల్లలకు తప్పనిసరి
- ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా నిల్వలు
- ప్రతి శని, బుధవారాల్లో వ్యాక్సినేషన్
- నేడు ప్రపంచ టీకాల దినోత్సవం



నరసన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి శిశువుల వరకూ ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీనివల్ల వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధినిరోధన టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు. జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రితో పాటు టెక్కలి జిల్లా ఆసుపత్రి, నరసన్నపేట ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, గ్రామీణ క్లినిక్‌లో టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్‌లు ఇలా..

- గర్భిణులకు మూడునెలలు నిండిన తరువాత ఒక టీటీ ఇంజెక్షన్, మరో నెలరోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్, ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హైపటైటిస్-బీ డోసు వేయాలి. వీటివల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. 14రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6-14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి.
- 6,10,14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి (మిగతా 7వ పేజీలో..)

మద్యం మత్తు.. జీవితం చిత్తు



- డ్రంకెన్ డ్రైవ్‌తో అధిక రోడ్డు ప్రమాదాలు
- గత రెండేళ్లలో 579 మంది మృతి
- క్షతగాత్రులైన 236 మంది
- మద్యం, మాదక ద్రవ్యాల బారిన యువత
- జరిమానా, జైలు శిక్ష విధిస్తున్నా మారని తీరు



శ్రీకాకుళంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

● గత నెల 7న శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడుపుతూ డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద హల్‌చల్ చేశాడు. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా వారిపై విరుచుకుపడ్డాడు. అప్పటికే ఫూటుగా మద్యం సేవించినట్టు తేలడంతో పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆ యువకుడికి 45 రోజుల పాటు జైలు శిక్ష విధించారు.

శ్రీకాకుళం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువత చిత్తు అవుతున్నారు. తమతో పాటు ఇతరుల జీవితాలను కూడా పణంగా పెడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం డ్రంకెన్ డ్రైవ్ వల్లే జరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ఎన్ని నివారణా చర్యలు చేపడుతున్నా కొందరు మందుబాబులు తీరు మారడం లేదు. 25 ఏళ్లలోపు యువకులే మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

గత రెండేళ్లలో పరిస్థితి..

జిల్లాలో గత రెండేళ్లలో 554 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 579 మంది చనిపోయారు. 236 మంది క్షతగాత్రులయ్యారు. వీటిలో అధికశాతం ప్రమాదాలకు కారణం మద్యం తాగి వాహనాలు నడపడమేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. గత రెండేళ్లలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 77,292 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అందులో ఒక వ్యక్తికి నెల రోజుల పాటు జైలుశిక్ష కూడా పడింది. కొన్నాళ్లగా పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. మద్యం తాగి వాహనం నడిపేవారి వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించేవారు. దీనివల్ల మందుబాబుల తీరులో ఎటువంటి మార్పు రాకపోవడంతో పోలీసులు తమ పంథా మార్చారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి జరిమానా విధించి వదిలేయకుండా కోర్టులో హాజరుపరుస్తున్నారు. కోర్టు విచారణ జరిపి మొదటిసారి పట్టుబడిన వారికి రూ.1500 నుంచి రూ.2 వేలు వరకు జరిమానా విధిస్తుంది. రెండోసారి పట్టుబడితే జైలు శిక్ష విధిస్తుంది. అయినా మందుబాబుల తీరులో ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదు.

30 శాతం మంది మైనర్లే...

మద్యం, మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న వారిలో 30 శాతం మంది మైనర్లే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 18 నుంచి 30 మధ్య వయసున్న వారు 50 శాతం, 30-60 మధ్య వయసున్న వారు పది శాతం, 60 ఏళ్లు దాటిన వారు (మిగతా 7వ పేజీలో..)

మంగోలియాలో చిక్కుకున్న మత్స్యకారుడు

- రక్షించాలని కోరుతున్న కుటుంబ సభ్యులు



గారయ్య

సంతబొమ్మాళి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): లక్కివలస పంచాయతీ పిట్టవానిపేట గ్రామానికి చెందిన తూలు గారయ్య (37) అనే మత్స్యకారుడు మంగోలియా దేశంలో చిక్కుకున్నాడు. ఈ ఏడాది మే 15వ గారయ్య పెయింటర్ ఉద్యోగం కోసం మంగోలియా వెళ్లాడు. అక్కడ మెగా ఇంజనీరింగ్ కంపెనీలో చేరాడు. అగ్రిమెంట్ పూర్తవడంతో ఇండియా వచ్చేందుకు ఈ నెల 7న మంగోలియా యులాన్ బటార్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా అక్కడ ఆయన్ను పోలీసులు అరెస్టు చేసినట్లు కంపెనీ మేనేజర్ బాజీ నుంచి ఆదివారం తమకు సమాచారం వచ్చిందని గారయ్య భార్య ఎర్రమ్మ తెలిపింది. అరెస్టుకు కారణాలను తెలియజేయలేదని రోదిస్తుంది. తమ భర్తను స్వదేశానికి క్షేమంగా రప్పించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు,రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడును ఆమె కోరింది.

సీదిరికి మరోసారి నోటీసులు

- నేడు విచారణకు హాజరుకావాలన్న పోలీసులు



అప్పలరాజుకు నోటీసు అందిస్తున్న ఎస్ఐ నర్సింహమూర్తి

పలాస, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ సమన్వయకర్త సీదిరి అప్పలరాజుకు పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. నకిలీ మద్యం, అధిక ధరలకు అమ్ముతున్నారని ఆయన చేసిన ఆరోపణలకు గాను విచారణకు హాజరుకావాలని కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి ఆదివారం సీదిరికి తన నివాసంలో నోటీసులు అందించారు. గత నెలలో కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి జంక్షన్ వద్ద నకిలీ మద్యం విషయంపై మహిళలతో కలసి వైసీపీ నేతలు ఆందోళన చేపట్టారు. అక్కడకు వెళ్లిన ఓ మహిళా కానిస్టేబుల్‌తో వైసీపీ కార్యకర్త ఒకరు అసభ్యకరంగా ప్రవర్తించారని అప్పట్లో కేసు కూడా నమోదైంది. దీనికి సంబంధించి సీదిరి చేసిన వ్యాఖ్యలకు గాను వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ అయ్యాయి. సోమవారం కాశీబుగ్గ పోలీ స్టేషన్‌కు విచారణకు హాజరు కావాలని ఎస్ఐ కోరారు. ఇప్పటికే పోలీసు స్టేషన్‌కు సంబంధించి వివాదస్పద వ్యాఖ్యలు చేయడంతో శనివారం ఆయన్ను మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ ఏడు గంటల పాటు పోలీసులు విచారించిన విషయం విధితమే. ఇప్పుడు రెండోమారు నోటీసులు జారీచేశారు.

ఒక్కోచోట.. ఒక్కో రకంగా..

- తుఫాన్ బాధిత గ్రామాల్లో రేషన్ పంపిణీలో వివక్ష
- మత్స్యకారులకు అందించి మిగతా వారికి ఇవ్వని వైనం
- కార్డుదారుల అసంతృప్తి



సోంపేటలో మత్స్యకారులకు బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు (ఫైల్)

సోంపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని మత్స్యకార గ్రామాల్లో ప్రజలందరికీ 50 కిలోల బియ్యం, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార, కందిపప్పు కిలో చొప్పున, నూనె ఒక ప్యాకెట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, ఈ సరుకుల పంపిణీలో వివక్ష చోటుచేసుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కోచోట ఒక్కోరకంగా పంపిణీ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మత్స్యకార గ్రామాల్లో కేవలం మత్స్యకార కుటుంబాలకే బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేసి మిగతా కుటుంబాలకు ఇవ్వడం లేదని కార్డుదారులు అసంతృప్తి వ్యక్తచేస్తున్నారు. తాము కూడా చేపల వేట మీదే బతుకుతున్నామని, తమకు రేషన్ పంపిణీ చేయకపోవడం తగదని అంటున్నారు. జిల్లాలోని 11 మండలాల పరిధిలో ఉన్న 104 మత్స్యకార గ్రామాల్లో 26 వేల మంది లబ్ధిదారులకు 50కిలోల చొప్పున బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేయాలని అధికారులు జాబితా విడుదల చేశారు. ఈ మేరకు సోంపేట నియోజకవర్గంలో 9 రేషన్ డిపోల పరిధిలో 2,670 మందికి సరుకులు అందజేశారు. మందస మండలం గెడ్డూరులో అందరికీ ఇచ్చారు. ఇదే మండలం గంగువాడ, బేదాళపురంలో మత్స్యకార కులస్థులకే బియ్యం అందించి మిగతా వారిని విస్మరించారు. వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడులో 800 కార్డులు ఉంటే 60 మందికే పంపిణీ జరిగింది. ఇదే మండలం కంబాలరాయుడుపేటలో 75 మందికి ఇచ్చారు. ఈ గ్రామంలో 40 మందికి అనర్హులకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి సముద్ర తీర గ్రామాల్లో ఉన్న మత్స్యకారులే కాకుండా ఆ గ్రామాల్లో నివసిస్తున్న ఇతర కులాల వారు కూడా చేపల వేట ఆధారంగా బతుకుతున్నారు. వారితో పాటు వీరికి కూడా సమానంగా పథకం వర్తించే విధంగా అధికారులు ఆలోచనలు చేయాలి. అయితే, గతంలో మత్స్యకార భరోసా పొందుతున్న వారికే బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేసి, మిగిలిన వారిని పక్కన పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అందరికీ రేషన్ అందేవిధంగా చూడాలని మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు కోరుతున్నారు.

నాగావళిలో యువకుడి గల్లంతు

- మరొకరిని కాపాడిన స్థానికుడు
- అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు
- ప్రమాదకరంగా నదిలో గోతులు



గల్లంతైన ఉదయ్

శ్రీకాకుళం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగావళి నదిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. మరొక యువకుడిని స్థానికుడు కాపాడడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. గల్లంతైన యువకుడి కోసం అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటన శ్రీకాకుళం నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కృష్ణాపార్కు వద్ద గల మహిళమండల వీధికి చెందిన వమ్మి ఉదయ్(18), తన స్నేహితులు లోకేష్, ప్రసాద్, కార్తీక్ కలిసి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తమ వీధికి ఆనుకుని ఉన్న నాగావళి నదీ తీరానికి వెళ్లారు. ఉదయ్, లోకేష్ స్నానం కోసం నదిలోకి దిగగా, మిగతా ఇద్దరు ఒడ్డుపై ఉన్నారు. నీటి ప్రవాహానికి ఉదయ్, లోకేష్ కొట్టుకుపోతుండడాన్ని స్నేహితులు గమనించి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. వారివల్ల సాధ్యంకాకపోవడంతో కేకలు వేశారు. దీంతో అక్కడే నదిలో చేపలు పడుతున్న జైరామ్ అనే స్థానికుడు లోకేష్‌ను కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చాడు. ఉదయ్ జాడ మాత్రం కనిపించలేదు. స్థానికుల సమాచారంతో టూటౌన్ ఎస్ఐలు రామారావు, లక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని ఉదయ్ కోసం నదిలో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

నెల కిందటే వచ్చాడు..

ఉదయ్‌కు తండ్రి నారాయణరావు, తల్లి కుమారి, ఒక సోదరి ఉన్నారు. తండ్రి టాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తల్లి గృహిణి. ఐటీఐ పూర్తి చేసిన ఉదయ్ ఇటీవల అప్రెంటీస్ కోసం కోల్‌కత్తాకు వెళ్లాడు. అప్రెంటీస్ పూర్తి చేసుకుని నెల రోజులు కిందటే ఇంటికి వచ్చాడు. త్వరలోనే ఏదైనా ఉద్యోగంలో చేరి కుటుంబ భారాన్ని కొంతవరకు మోస్తానని తమకు భరోసా ఇచ్చినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంతలోనే నదిలో గల్లంతు కావడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రమాదకరంగా గోతులు..

నగరంలోని మహిళా మండల వీధి, కృష్ణాపార్కు, తురాయి చెట్టువీధి, పెద్ద రెల్లివీధి వద్ద నాగావళి నదిలో గతంలో ఇసుకను పెద్ద మొత్తంలో తవ్వి ఎడ్ల బండ్లలో తరలించారు. దీంతో నదిలో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. స్నానాల కోసం నీటిలో దిగుతున్న వారు గోతుల్లో పడి నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

క్రీడల్లో మెరిశారు..

జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆర్చరీ, కబడ్డీ, స్విమ్మింగ్ తదితర పోటీల్లో పాల్గొని పతకాలు, బహుమతులు సాధించారు. ఆ వివరాలిలా..

● ఆర్చరీలో ఓవరాల్ చాంపియన్ జిల్లా జట్టు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన శ్రీకాకుళం ఆర్చరీ జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరులో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన ఆర్చరీ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. నగరానికి చెందిన అర్జున అర్చరీ అకాడమీకి చెందిన ఏడుగురు విద్యార్థినీ, విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14, 19 కాంపౌండ్, రికర్వ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో బాలబాలికలు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఆరంగి కల్యాణ్, పంగ షణ్ముఖ శ్రీ, పైడి త్రివేణి , గోపిన తనీషా చౌదరి (బంగారం), ఒడిసి మేఘన (కాం స్యం), గోపిన లక్ష్మి తన్విక జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం వారణాసి, మణిపూర్ రాష్ట్రాల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారు.

సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో..



రాష్ట్ర కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. కడ ప జిల్లా పులివెందులలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో బాలికల జట్టు ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసు కుంది. ఫైనల్ పోటీలో అనంతపురం జట్టుపై శ్రీకాకుళం బాలికల జట్టు విజయం సాధించింది. అలాగే ఫైనల్స్‌లో శ్రీకా కుళం బాలురు జట్టు బాపట్ల చేతిలో ఓటమి చెంది ద్వితీయ స్థానంతో సరిపెట్టు కుంది. ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించిన బాలబాలికలకు కోచ్, మేనే జర్లుగా ఎం.వెంకట రావు, డి.శ్యామ్ కాంతారావు, జాన్సీ వ్యవహరించారు. ఈ సందర్భంగా బాలబాలికల ను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్ గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముస లి నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, ట్రెజరర్ నగాళ్ల రమేష్ తదితరులు అభినందించారు.

స్విమ్మింగ్‌లో శైలజ ప్రతిభ



శైలజను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఇచ్ఛాపురానికి చెందిన శైలజ హండ్రడ్ బటర్‌ఫ్లైయ్‌లో వెండి పతకం సాధించినట్లు కోచ్ రామారావు తెలిపారు. ఇచ్ఛాపురం కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శైలజ నేషనల్ సెలక్షన్స్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ భారతి తదితరులు అభినందించారు.

విద్యార్థినికి అభినందన



జి.చందన

ఇచ్ఛాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రత్తకన్న గ్రామానికి చెందిన జి.చందన ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు హెచ్‌ఎం తెలిపారు. వంద మీటర్ల పరుగుపందెం విభాగంలో కాంస్య పతకం, 4/100మీటర్ల ర్యాలీలో బంగారు పతకం సాధించిందన్నారు. ఈ సందర్భంగా చందన తదితరులను ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



చదరంగం పోటీలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరుతీసుకు రావాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఇలిసిపురంలో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి చదరంగం పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విజేతలకు పతకాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో శిక్షకులు భేరి చిన్నారావు, సాయి నిరంజన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రీవెన్స్‌ను వినియోగించుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక 'మీకోసం' స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను 'మీకోసం.ఏపీ. జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, అలాగే ఇప్పటికే సమర్పించిన ఫిర్యాదుల పరిస్థితిని 1100 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని కోరారు.

నేడు ఎన్ఎస్ఎస్ శిబిరం

ఇచ్ఛాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తేలుకుంచి గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం సోమవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ఢిల్లీరావు

ఇచ్ఛాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా సాలిన ఢిల్లీరావును ఎన్నుకున్నట్లు జిల్లా కోశాధికారి వల్లంపాటి కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా స్థానికంగా పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఢిల్లీరావును నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

ఘనంగా అఖండ నామ సంకీర్తన

రణస్థలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి సంద ర్భంగా స్థానిక మందిరంలో 24 గంటల అఖండ నామ సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం వరకు భజన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి శ్రీరంగనాయకులు విశేష కృషి



శ్రీరంగనాయకులు మాస్టారు దంపతులను అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

ఎచ్చెర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి గురుగుబెల్లి శ్రీరంగనాయకులు మాస్టారు విశేష కృషి చేశారని, ఆయన చేసిన సేవలు అభినందనీయమని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శ్రీరంగ నాయకులు మాస్టారి పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ శ్రీకాకుళం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాస్టారు విద్యారంగంలో విశేష సేవలందించి ఎంతో మంది విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. మాస్టారు దంపతులకు శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహన రావు, జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా పూర్వపు అధ్యక్షుడు పి.అప్పారావు, వేంక టేశ్వర విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, ఎంఈవోలు కె.పున్నయ్య, వాగ్దేవి, శాంతికుమారి, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అర్ధనారీశ్వర సైకత శిల్పం



హరికృష్ణ రూపొందించిన సైకత శిల్పం

ఆమదాలవలస, నవంబరు, 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా ప్రసిద్ధ సంగమేశ్వర ఆలయం వద్ద రూపొం దించిన అర్ధనారీశ్వర సైకత శిల్పం ఆకట్టుకుంది. ఆదివారం గాజుల కొల్లివలసకి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ దీనిని రూపొందించారు. ఆలయానికి మూడో సోమవారం అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు ఈ సైకత శిల్పాన్ని కూడా సందర్శించి తరిస్తారని రూపొందించినట్లు ఆయన తెలిపారు.

గొర్రెలకు వైద్య సేవలు: జేడీ



గొర్రెలకు చికిత్స అందిస్తున్న దృశ్యం

గార, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గారలో తోణంగి గంగరాజుకు చెందిన వ్యాధి సోకిన గొర్రె లకు పశు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'అంతుచిక్కని వ్యాధితో గొర్రెల మృతి' శీర్షికతో వచ్చిన కథనానికి పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజ గోపాలరావు, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ కిషోర్, ఏడీ డాక్టర్ బాలకృష్ణ కళిం గపట్నంలో మిగిలిన గొర్రెల ఆరోగ్య పరిస్థితిని పరి శీలించి అక్కడ వైద్య సిబ్బందికి తగిన సూచ నలిచ్చారు. జేడీ మాట్లాడుతూ.. ఈ గొర్రెలకు పూర్తి స్థాయిలో తేరుకునేవరకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.


టీకా.. ఆరోగ్యానికి రక్ష

(ఐదో పేజీ తరువాయి)

రాకుండా మీజల్స్ కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి.

- 16 నెలల నుంచి 2నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజల్స్ విటమిన్-ఏ, ఓపీని వేయించాలి.
- ఐదేళ్లు పూర్తయిన తరువాత డీపీటీ డోసు వేయించాలి. 10ఏళ్లకు, 16 ఏళ్లకు టెట్నాస్ (టీటీ) చేయించాలి.

టీకాలు తప్పనిసరి..



గర్భిణులు , చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోచ్చును. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

-డా.దుంగ సుధారాణి,
బొంతు పీహెచ్‌సీ, సారవకోట

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- ఆదివారం ఒక్కరోజు రూ.10.76లక్షలు



ఉచిత దర్శనానికి బారులు తీరిన భక్తులు



రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

అరసవల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో ప్రసాద్ నిరంతరం పర్యవేక్షించారు. తొలుత స్వామివారి ఇంద్ర పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి దీపాలు వదిలారు. రావిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.10,76,506 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో టిక్కెట్ల ద్వారా రూ.6,92,600, విరాళాలు రూ.1,14,266, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,69,640 ఆదాయం లభించింది.

నేటి నుంచి సమ్మెటివ్ పరీక్షలు

సోంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సమ్మెటివ్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. విద్యాశాఖ విడు దల చేసిన షెడ్యూల్ ఇలా ఉంది.. 8, 9, 10 తరగతులకు ఉదయం, 6, 7 తరగతులకు మధ్యాహ్నం సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతిలో 100 మార్కులు, ఇతర తరగతు లకు 80 మార్కులకు పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. సోమవారం తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లీష్, 13 గణితం, 14న ఫిజికల్ సైన్స్, 15 బయాలాజికల్ సైన్స్, 17 సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించ నున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 11న తెలుగు, 12న ఇంగ్లీష్, 13 గణితం, 14న ఈవీఎస్ పరీక్షలను ప్రతిరోజు ఉదయం నిర్వహించనున్నారు. ఓరియంటల్ పాఠశాలలకు చెందిన పరీక్షలు 18, 19 తేదీల్లో నిర్వహించనున్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా 1 నుంచి 5వరకు ప్రశ్నాపత్రాలను క్లస్టర్ కాంప్లెక్స్ లో, 6 నుంచి 10వ తరగతి వరకు ప్రశ్న పత్రాలను ఎమ్మార్సీల్లో భద్రపరుస్తారు. వీటిని పంపిణీ చేసేందుకు ఎంఈవో 1, 2 హెచ్‌ఎం, సీనియర్ స్కూల్ అసిస్టెంట్, క్లస్టర్ స్థాయిలో ఒక హెచ్‌ఎంతో కమిటీ ఏర్పాటుచేశారు.

ప్రతీ పరీక్షకు గంట ముందు మాత్రమే పేపర్లను పాఠశాలకు అందజేయనున్నారు. ఈ ప్రశ్న పత్రాలను ఈనెల 25లోగా దిద్ది మార్కులను లీప్‌యాప్‌లో నమోదు చేసి, 30వ తేదీ నాటికి ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ శిఖర స్థాపన



ధ్వజస్తంభ శిఖరానికి పూజ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్ సమీపంలో నూతనంగా నిర్మించిన విజయ భవానీ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ధ్వజస్తంభ శిఖరం ఏర్పాటు చేశారు. తంబి గురు భవానీ, రాజేంద్ర గురుభవానీ వీటిని ప్రతిష్ఠించారు. దుర్గా శ్రీనివాస్, వైకుంఠరావు, జగన్మోహన్‌రావు, నరసింగరావు దంపతులతో ఆలయ అర్చకులు వెంకట రామరత్న, హయగ్రీవరావు ప్రత్యేక పూజలు చేయించి ధ్వజస్తంభ శిఖర స్థాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు మొదలవలస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తు.. జీవితం చిత్తు

(ఐదో పేజీ తరువాయి)

పది శాతం మద్యం, మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పిల్లలు తప్పటడుగులు వేస్తే తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాలి. మైనర్లపై కేసు నమోదైతే వారి భవిష్యత్‌కు ఇబ్బందులు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. కౌన్సెలింగ్ ద్వారా వారిలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.

కఠిన చర్యలకు ఉపక్రమించినా..

ట్రాఫిక్ పోలీసులు రహదారి భద్రతా వారోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకున్న వారి వివరాలు, వీడియోలను సోషల్ మీడియాలో పెట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తున్నారు. తాగిన మత్తులో రోడ్డు ప్రమాదాలు చేసి ఇతరుల మృతికి కారణమైన వారిపై 304 పార్ట్-2 ఐపీసీ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నా, ఎన్ని జరిమానాలు విధిస్తున్నా చాలా మందిలో మార్పు రావడం లేదు.

పిల్లలపై శ్రద్ధ అవసరం..

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. తనిఖీల్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తున్నాం. కొంతమందికి జైలుశిక్ష కూడా పడుతుంది. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి.

-వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- హైవే దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్
- వాహనం నడుపుతున్న వ్యక్తికీ తీవ్రగాయాలు



మృతిచెందిన యువతి నామాల వేణు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హైవేపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో యువతి అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడుపుతున్న వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. కొత్తరోడ్డు హైవేపై శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. రూరల్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం పుణ్యగిరి ప్రాంతానికి చెందిన వినుకోట శ్రీనివాసరావు (30), నామాల వేణు(22) బైక్‌పై ఆదివారం రాత్రి హైవేపై కొత్తరోడ్డు వద్ద శ్రీకాకుళం మీదుగా వెళ్తున్నారు. అదే రోడ్డులో ఒడిశాకు చెందిన లారీని పెట్రోల్‌బంకు సమీపంలో నిలిపి డ్రైవర్ అవతల రోడ్డుకు వెళ్లాడు. ఆ ప్రాంతంలో పెద్దగా వెలుతురు లేదు. అదే సమయంలో అటుగా బైక్‌పై వస్తున్న శ్రీనివాసరావు లారీ డ్రైవర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న శ్రీనివాసరావు, ఆయన వెనుక కూర్చున్న వేణు, లారీడ్రైవర్ కిందపడ్డారు. అయితే ఈ ఘటనలో వేణుకు మాత్రం తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. లారీడ్రైవర్ కూడా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని విషయాన్ని రూరల్ స్టేషన్ పోలీసులకు, అంబులెన్స్‌కు తెలిపారు. క్షతగాత్రుడు శ్రీనివాసరావును ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. యువతి వేణు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బైక్‌పై ఎక్కడ నుంచి.. ఏ ప్రాంతానికి వెళ్తున్నారు.. వీరిద్దరూ ఎవరు.. ఇతర వివరాలపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న శ్రీనివాసరావు

శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్న భక్తులు

జలుమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి బారులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు శ్రీముఖలింగం వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఏడుకొండలు పర్యవేక్షణలో బారికేడ్లు, ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ప్రసాదాలు విక్రయించకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆమదాలవలస పురపాలకసంఘం

రేఖా నెం: 746/2025/ఇ2. తేది : 07.11.2025

ఇ.ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆమదాలవలస పురపాలకసంఘం పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులకు ఇ-ప్రోక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

ఎస్‌పిఎఫ్‌ని: 08 — అంచనా కాంట్రాక్టు విలువ : 77,27,740/-

1) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడు చేయుటకు ప్రారంభపు తేది	10.11.2025 ఉదయం 11.00 గంటలకు
2) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడు చేయుటకు ఆఖరు తేది మరియు సమయం	తేది : 24.11.2025 మధ్యాహ్నం గం.1.00 లకు
3) బిడ్ స్వీకరించుటకు ఆఖరు తేది	తేది : 24.11.2025 మధ్యాహ్నం గం.3.00 లకు
4) బిడ్ తెరుచు తేది	తే 24.11.2025ది సాయంత్రం 4.00 గంటలకు

ఇతర వివరముల కొరకు ఆఫీసు పనిచేయు వేళలలో సంబంధిత విభాగం అధికారులను సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనరు, ఆమదాలవలస పురపాలకసంఘం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ సూర్యనారాయణస్వామి వారి దేవస్థానం

అరసవల్లి, శ్రీకాకుళం జిల్లా-532 421

ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

శ్రీకాకుళం జిల్లా, అరసవల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సూర్యనారాయణస్వామి వారి దేవస్థానము చెందిన ఈ క్రింది తెలిపిన ఐటమ్స్ నిమిత్తము తేది: 24-11-2025న ఉదయం 11.00గం.లకు ఈ-ప్రోక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము జరుపబడును. టెండర్ షరతులు మరియు వివరముల కొరకు వెబ్‌సైట్ www.tender.apeprocurement.gov.in అడ్రస్‌లో చూడగలరు. మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయ పనివేళలనందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం వివరములు	కాల పరిమితి	ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఫీజు
1.	తలనీలాలు ప్రోగు చేసుకొను లైసెన్స్ హక్కు	01-01-2026 నుండి 31-12-2026	5,00,000/-	500/-
2.	సెల్‌ఫోన్లు మరియు కెమెరాలు, బ్యాగులు (లగేజ్) భద్రపరుచు లైసెన్స్ హక్కునకు	డిటో	3,00,000/-	500/-
3.	శానిటేషన్ సామాగ్రి సప్లై చేయుటకు	డిటో	50,000/-	300/-
4.	కూరగాయలు మరియు ఆకుకూరలు సప్లై చేయుటకు	డిటో	50,000/-	500/-
5.	పాలు పెరుగు సప్లై చేయుటకు	డిటో	10,000/-	300/-
6.	ప్రసాదం ప్యాకింగ్ కవర్లు పేపర్ కవర్లు వగైరా సప్లై చేయుటకు	డిటో	10,000/-	300/-
7.	ప్లంబింగ్ మెటీరియల్ సప్లై చేయుటకు	డిటో	10,000/-	300/-
8.	ఎలక్ట్రికల్ మెటీరియల్ సప్లై చేయుటకు	డిటో	10,000/-	300/-
9.	గోవుల దాణాకి సంబంధించిన మెటీరియల్ సప్లై చేయుటకు	డిటో	10,000/-	300/-
10.	స్వామివారి ఫోటోలు సప్లై చేయుటకు	డిటో	10,000/-	300/-
11.	నిత్య అలంకరణ నిమిత్తం పూలదండలు, విడిపూలు సప్లై చేయుటకు	డిటో	10,000/-	300/-
12	లడ్డు పులిహోర ప్రసాదములు ప్యాకింగ్ నిమిత్తము	డిటో	10,000/-	300/-
13.	చింతపండు మగ్గు తీయుటకు	డిటో	5,000/-	300/-
14.	శెనగపిండి మిల్లింగ్ నిమిత్తము	డిటో	5,000/-	300/-
15.	శ్రీ స్వామివారి ప్రసాదములు తయారీ ప్రదేశము నుండి అమ్మకము ప్రదేశమునకు తరలించుటకు	డిటో	5,000/-	300/-
16.	శ్రీ స్వామివారి కార్యాలయ సత్రవులు నందు గల డోర్‌కర్టెన్స్, మేట్స్, బెడ్‌షీట్స్, వగైరాలు ఉతికి శుభ్రం చేసి అప్పగించుటకు దోబి ఖర్చులు	డిటో	5,000/-	300/-
17.	1'6"x8' పొడుగు కింద నుండి ఎత్తు నాలుగు అడుగులు 304 గేజుగల స్టీల్ హుండీ-1 1'6"x6' పొడుగు కింద నుండి పైకి ఎత్తు నాలుగు అడుగులు 304 గేజు గల స్టీల్ హుండీ-1 మరియు 1'x4' పొడుగు కింద నుండి పైకి ఎత్తు మూడు అడుగులు 304 గేజు గల స్టీల్ హుండీ-1			300/-
18.	304 గేజు గల స్టీల్ 3x7 అడుగుల ట్రేలు ఎత్తు 8" ఎత్తు రెండు ట్రేలు సప్లై చేయుటకు			300/-
19.	పెద్దతోట వద్ద 110x68 చదరపు అడుగుల స్థలంలో ఒక అడుగు గ్రావెల్ 3 అంగుళాల క్రషర్ సాయిల్ ఫిల్లింగ్ లెవెల్ చేసి అప్పగించుటకు			300/-
20.	అసిరితల్లి అమ్మవారి రోడ్డు అవతల బస్టాండ్ వెనుకభాగమున గల స్థలము 70x50 చ.అ.స్థలంలో ఒక అడుగు గ్రావెల్ 3 అంగుళాల క్రషర్ సాయిల్ ఫిల్లింగ్ లెవెలింగ్ చేసి అప్పగించుటకు			300/-
21.	ది.25.01.2026వ తేదీన రథసప్తమి సందర్భంగా మైక్‌సెట్లు, మైకులు ఏర్పాటు చేయుటకు			300/-
22.	ది.25.01.2026వ తేదీన రథసప్తమి సందర్భంగా వివిధ స్థలాలలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు			300/-
23	1 1/2 సైజు గల GI.పైపుతో 20 అడుగుల పొడవు ఎత్తు 4 అడుగులు షెడ్యూలు తెలిపిన ప్రకారముగా 50 బారికేడ్లు తయారు చేసి ఇచ్చుటకు			300/-

ఫోన్ నెం: 8978914660. | వ్యవస్థాపక ధర్మకర్త | ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



సుందరమ్మ (ఫైల్)

కోటబొమ్మాళి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దంత గ్రామానికి చెందిన సాకిపల్లి సుందరమ్మ(62) ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందింది. పోలీసులు తెలిసిన వివరాల మేరకు.. సుందరమ్మ తన పెద్ద కుమార్తె నీలవేణి, అల్లుడు చంటి, అడపడుచు లక్ష్మిలను బస్సు ఎక్కించేందుకు దంత గ్రామంలో గల కొత్తమ్మతల్లి గుడి వద్దకు వచ్చింది. ఇక్కడి నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ టర్నింగ్ చేస్తుండగా.. బస్సు వెనుక నిల్చున్న సుందరమ్మ దీనిని గమనించలేదు. దీంతో బస్సుకి రాయికి మధ్యలో ఉండిపోవడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా.. అప్పటికే సుందరమ్మ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సుందరమ్మ భర్త సూర్యనారాయణ ఐదేళ్ల కిందటే మృతి చెందగా, వీరికి వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుందరమ్మ చిన్న కుమార్తె రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి..

కవిటి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొజ్జిరియా జంక్షన్ వద్ద ఆదివారం ట్రాక్టర్ బోల్తాపడి కార్తీక్‌దాస్(16) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం రత్తకన్న నుంచి ఇటుకలతో జమేదారుపుట్టుగ వెళుతున్న ట్రాక్టర్ కొజ్జిరియా జంక్షన్‌లోని కల్వర్టు వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై కూర్చున్న కార్తీక్‌దాస్ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రుడిని ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కార్తీక్‌దాస్ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా హింజిలీఘాట్ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. కాగా ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన గీత

నందిగాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్లపూడి గ్రామానికి చెందిన వివాహిత దూర్గాసి గీత అదృశ్యమైనట్టు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గీత ఈనెల 7వ తేదీ శుక్రవారం పెద్దతావరాపల్లి బ్యాంక్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కోసం బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఆమె తండ్రి బుడ్డ లచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈమెకు ఒక కుమారుడు ఉన్నాడు.

యువకుడి మృతదేహం గుర్తింపు



సాయినేతాజీ(ఫైల్)

ఎచ్చెర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం శ్రీకాకుళం నగరం ఏడు రోడ్ల కూడలి సమీపంలోని వంతెన పైనుంచి నాగావళి నదిలో దూకిన యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గుజరాతీపేట శివాలయంవీధికి చెందిన సాయినేతాజీ (17)ని తండ్రి ఉమారుద్ర కోటేశ్వరరావు మందలించడంతో మనస్తాపం చెంది ఈనెల 7న రాత్రి నాగావళి నదిలో దూకాడు. ఈ క్రమంలో మండలంలోని బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం వద్ద సముద్ర తీరంలో సాయినేతాజీ మృతదేహాన్ని ఆ గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సాయినేతాజీగా గుర్తించారు. దీనిపై ఇప్పటికే శ్రీకాకుళం టూటౌన్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, యువకుడి తండ్రి నుంచి వివరాలు సేకరించినట్టు తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్‌లోని ఓ తోటలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.రాము తెలిపారు. సింగుపురం జ్యూట్‌మిల్ సమీపంలో గల తోటలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.7చ261 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

15 మందిపై కేసు నమోదు

ఆమదాలవలస, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నిమ్మతొర్లాడ గ్రామ సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్న 15 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఆదివారం తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా 15 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.21,640 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

రేకుల షెడ్డు దగ్ధం

పొందూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తండ్యాం గ్రామంలో ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సంభవించడంతో నేతల జగన్నాథానికి చెందిన రేకుల షెడ్డు దగ్ధమైంది. స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందిచారు. వారు సకాలంలో వచ్చి మంటలను అదుపు చేసినా అంతలోనే సర్వస్వం బూడిదైంది. జగన్నాథం బెంగుళూరులో ఉంటున్నారు. ఈయన తల్లిదండ్రులు తవుడు, పార్వతి గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటిలోని విలువైన వస్తువులు, బంగారం, నగదు, డాక్యుమెంట్లు, ఇతర సామగ్రి బూడిదయ్యాయని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షలు ఆస్తినష్టం వాటిల్లి ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

వైసీపీ పట్టణాధ్యక్షుడ్ని విచారిస్తున్న పోలీసులు

పలాస, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పట్టణ వైసీపీ అధ్యక్షుడు శిష్టు గోపిని కాశీబుగ్గ పోలీసులు ఆదివారం 41 నోటీసులు ఇచ్చి విచారణకు హాజరుకావాలని కోరారు. దీంతో సాయంత్రం 3 గంటల నుంచి సీఐ పి.సూర్యనారాయణ ఆయన్ని విచారిస్తున్నారు. ఇటీవల పలాసలో వ్యాపారి కిడ్నాప్‌కు సంబంధించి సోషల్ మీడియాలో ఆయన చేసిన వ్యాఖ్యలపై విచారణ చేపట్టారు. అనతి కాలంలోనే సీనియర్లను తలదన్ని పట్టణ అధ్యక్షుడిగా గోపి ఎంపికయ్యారు. ఈ క్రమంలో గోపి టీడీపీ వైఫల్యాలపై సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడుతుండేవారు. కూటమి ప్రభుత్వం రాకముందు నుంచే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు.

మరదలపై రిటైర్డు వీఆర్వో దాడి

వజ్రపుకొత్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సుంకర జగన్నాథపురం గ్రామానికి చెందిన వంకల దాలమ్మపై సొంతబావ, రిటైర్డు వీఆర్వో వి.లోహిదాసు దాడి చేసినట్టు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.నిహార్ చెప్పారు. ఆస్తితగదా విషయమై ఇరువురి మధ్య గొడవ జరిగింది. లోహిదాసు దాడి చేయడంతో దాలమ్మ గాయపడింది. ఈమె శ్రీకాకుళం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

సిద్ధాశ్రమంలో సంప్రోక్షణ పూజలు



సంప్రోక్షణ పూజలు చేస్తున్న దృశ్యం

నరసన్నపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధాశ్రమంలో ఆదివారం భక్తులు సంప్రోక్షణ పూజలను నిర్వహించారు. ఆశ్రమంలోని పంచలోహ విగ్రహాలు ఇటీవల చోరీకి గురై దొరకడంతో పోలీసులు నిర్వాహకులకు అప్పగించారు. కార్యక్రమంలో సిద్ధాశ్రమం స్వాములు పాల్గొన్నారు.

పిక్నిక్ సందడి



సంతబొమ్మాళి: భావనపాడు బీచ్‌లో..



వజ్రపుకొత్తూరు: శివసాగర్ బీచ్‌లో..



పోలాకి: రాజారాంపురం సాగరతీరంలో..

కార్తీక మాసం మూడో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పిక్నిక్‌ల సందడి నెలకొంది. పిల్లాపాపలతో ఆడుతూపాడుతూ జిల్లావాసులు గడిపారు. వివిధ తోటలు, సముంద్ర తీరాల్లో సందడి వాతావరణం నెలకొంది. భావనపాడు, శివసాగర్, రాజారాంపురం సముద్ర తీరాలు పర్యాటకులతో కళకళలాడాయి.

- ఆంధ్రజ్యోతి బృందం



గార: అంపోలు జైలు రోడ్డులో కార్తీక వనసమారాధనలో చిన్నారుల నత్యప్రదర్శన

భక్తులకు ఇబ్బంది రానివ్వొద్దు: ఎస్పీ



స్వామివారికి పూజలు చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

టెక్కలి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రావివలస వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోడం జరుగుతుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం రావివలస ఎండల మల్లికార్జునస్వామిని దర్శించుకొని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో గురునాథరావు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటన దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడికక్కడే బారికెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు వచ్చేందుక, వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



విజేతలతో నాయకులు, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపురం హైస్కూల్ మైదానంలో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి 69వ పాఠశాల అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. విజేతలకు మెడల్, జ్ఞాపికలు అందించి అభినందించారు. 13 ఉమ్మడి జిల్లాల విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. బాలురు విభాగంలో ఎం.వికాష్ (విశాఖ), బాలికులు విభాగంలో ఇషాన్, ఓవరల్ వ్యక్తిగత విభాగంలో చాంపియన్స్‌గా నిలిచారు. జట్టు చాంపియన్‌గా బాలురు, బాలికుల విభాగంలో విశాఖ జట్లు నిలిచాయి. అగ్నికులక్షత్రి రాష్ట్ర డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ బహుమతి ప్రదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిబాబు, పీఈటీలు గజేంద్ర తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న ఏపీటీపీసీ చైర్మన్

పలాస రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఆదివారం పలాస మండల పరిధిలో గరుడఖండి పంచాయతీ గోపాలపురం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రహరీకి రూ.9.31లక్షల సర్వశిక్ష అభియాన్ నిధులతో ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేపట్టారు. గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. పలాస నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిరీష ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, దువ్వాడ శ్రీహర్ష, దువ్వాడ సంతోష్‌నాయుడు, యవ్వారి మోహనరావు, చంద్రమౌళి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం వరకూ కాలువ పొడిగించాలి



నినాదాలు చేస్తున్న వంశధార సాధన కమిటీ సభ్యులు

మందస/హరిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వంశధార కాలువను ఇచ్ఛాపురం వరకూ పొడిగించాలని వంశధార సాధన కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. హరిపురంలో ఆదివారం వారు ర్యాలీ చేపట్టి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మార్పు మన్మధరావు, డి.వెంకట్రావు, దర్భాపు వెంకటరావు, దాసరి శ్రీరాములు, నల్ల హడ్డి, కొర్ల హేమారావు చౌదరి, మట్ట ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ సమస్య పరిష్కరించాలి

మెళియాపుట్టి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి నెల రేషన్ కోసం ఇబ్బందులు పడుతున్నామని ఈ పరిష్కరించాలని పెద్దకేదారి, గేటుపేట దంబ్యాగుడి గ్రామాల ప్రజలు కోరారు. రేషన్ సమస్యను పాతపట్నం మార్కెట్ కమిటి చైర్మన్ చిన్నింటి గౌరమ్మ, బి.దినకరరావు దృష్టికి తీసుకువెళ్లామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. ఒక్కచోట తమ గ్రామాలకు రేషన్ సరుకులు అందించాలని కోరారు.

లక్ష్యాలు సాధించేలా ప్రయత్నించాలి

- పర్వతారోహకురాలు, ఆర్మీ మేజర్ కవిత



మేజర్ కవితను సన్మానిస్తున్న గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలంటే కఠోర సాధన ఎంతో అవసరమని పర్వతారోహణలో రికార్డు సాధించిన మేజర్ వాసుపల్లి కవిత అన్నారు. ఆదివారం సాయంత్రం మెట్టూరులో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 6,488 మీటర్లు ఎత్తైన మౌంట్‌గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించే సహయంలోను, అలాగే బ్రహ్మపుత్ర నది ప్రవాహం రాఫ్ట్ చేసిన సమయంలో తన అనుభవాలను వివరించారు. చిన్న వయస్సులో ఆర్మీలో డాక్టర్‌గా చేరినట్టు తెలిపారు. ధైర్య సాహసాలతో ప్రపంచ రికార్డు సాధించినట్టు ఆమె వివరించారు. అనంతరం కవిత తల్లిదండ్రులు వాసుపల్లి రామారావు, రమ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

సన్మార్గంలో నడుచుకోవాలి

పోలాకి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం దండులక్ష్మీపురం పంచాయతీ చింతాడపేట స్వామిరామయోగి సేవాశ్రమంలో నిర్వహించిన గీతాపారాయణ, సత్సంఘ సమావేశాల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత సమాజ పరిస్థితులకు ప్రతి వ్యక్తి భక్తిభావం పెంపొందాలన్నారు. ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, కమిటీ సభ్యులంతా సత్కరించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సేవాశ్రమ సభ్యురాలు, యువమోర్చా నాయకురాలు చింతాడ భారతి, కిల్లి లక్ష్మణరావు, యాగాటి లక్ష్మణరావు, చింతాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెయ్యమ్మ సంబరాలు

సంతబొమ్మాళి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): గోవిందపురంలో రెయ్యమ్మ సంబరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా కార్తీక మూడో సోమవారం నుంచి మూడు రోజులపాటు సంబరాలు నిర్వహిస్తుంటారు. అమ్మవారి తిరువీధి, ఘటాలు, మర్రాటలతో భక్తులు పాల్గొనే సంబరాలు కన్నుల పండుగా జరగున్నాయి. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు రెయ్యి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలకరించి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కర్రి రాజేంద్ర ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ



బ్రాహ్మణతర్లాలో అయ్యప్పస్వామి పూజలు

పలాస రూరల్, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): పలాస మండలం బ్రాహ్మణతర్లా కాటమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఆదివారం హరిహరసుతుడు అయ్యప్ప పడి పూజా కార్యక్రమాన్ని భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సన్నిధాన గురుస్వామి బడే షన్ముఖస్వామి ఆధ్వర్యంలో పడిపూజ జరగగా కార్యక్రమంలో సుమారు 6వేల మంది స్వాములు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సన్నిధాన స్వాములు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రేపు జైభీమ్ యువజన సంఘ వార్షికోత్సవం

పలాస రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన బొడ్డపాడు గ్రామ జైభీమ్ యువజన సంఘం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు జైభీమ్ యువ జన సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో జైభీమ్ యువజన సంఘ వార్షికో త్సవ ఆవిష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కిక్కర ఢిల్లీరావు మాట్లాడుతూ 1992 నుంచి జైభీమ్ యువజన సంఘం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరవుతున్నట్టు తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తి చేస్తారు

టెక్కలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామన్న హామీ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యాక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు రూ.600కోట్లు కేటాయిస్తే పూర్తవుతాయని, మంత్రి అచ్చెన్నాయుడు ఆ దిశగా దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నారు. 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నేటికీ పూర్తికాలేదని, శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య అలాగే ఉండిపోయిందని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ నేతలు నంబూరు షన్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, బగాది వాసుదేవరావు, దర్మారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలి

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలతోపాటు అన్ని ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ప్రధాన దేవాలయాలైన శ్రీముఖలింగం, ఉమారుద్ర కోటేశ్వరరాలయం, ఎండలమల్లికార్జున స్వామి ఆలయం, శ్రీకూర్మం, అరసవల్లి వంటి ప్రముఖ శివ, వైష్ణవ క్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, చిన్న పిల్లలతో వచ్చే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. భద్రత, రవాణా, ఆరోగ్య సేవలు, శానిటేషన్ వంటి అంశాల్లో పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, దేవదాయశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా భక్తులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

శ్యామసుందర స్వామిని తాకిన సూర్యకిరణాలు



స్వామివారిని తాకుతున్న సూర్య కిరణాలు

టెక్కలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక తొలుసూరుపల్లి రోడ్డులో గల దేవదాయశాఖ పరిధిలో ఉన్న శ్యామసుందరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామికి సూర్యకిరణాలు తాకాయి. ఏటా కార్తీకమాసంలో స్వామివారికి సూర్య కిరణాలు నేరుగా తాకుతాయని అర్చకులు రమేష్ పండా తెలిపారు. ఈ అపూరు దృశ్యాన్ని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

12న సర్వసభ్య సమావేశం

పాతపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 12న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10.30గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని, అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో రావాలన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఎల్ఎన్ పేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల(లాయర్లు)కు కూటమి ప్రభుత్వం అండగా నిలవడం సంతోషకరమని జిల్లా లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది మృతి చెందితే రూ.4 లక్షలు ఆర్థిక సాయాన్ని అతడి కుటుంబానికి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరమన్నారు. దీంతో ఆ కుటుంబానికి కొంత ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు కే.46కోట్లు ఏపీ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్‌ను మ్యాచింగ్ గ్రాంట్‌కు ఆదేశాలు జారీచేయడం చిరస్మరణీయమన్నారు.

తెప్పలకు వాగ్దేవి పురస్కారం



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

పలాస రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య రంగం-కవితా గానం కార్యక్రమం ఆదివారం సింహాచలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాసకు చెందిన జన జాగృతి సాహితీ సంస్థ గౌరవాధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి రచించిన 'దేహమే దేవాలయం' ఉత్తమ కవితగా ఎంపికైంది. దీంతో నిర్వాహకులు కృష్ణమూర్తిని వాగ్దేవి పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు సారస్వత జాతీయ నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ కె.రాం ప్రసాద్, సభ్యులు నాంపల్లి శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహితీప్రియులు తెప్పల కృష్ణమూర్తికి అభినందనలు తెలిపారు.



టెక్కలి: ఒకే చోట చేరిన 1977-84లో చదువుకున్న పూర్వ విద్యార్థులు



పాతపట్నం: తెంబూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

పూర్వ విద్యార్థుల కలయిక

టెక్కలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఉన్నత పాఠశాలలో 1977-84 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం అదే స్కూల్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించుకుని సందడిగా గడిపారు. అప్పట్లో తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. దంత వైద్యులు సంపతిరావు జగదీష్, బెలుసొంటి నాగేశ్వరరావు, దుంపా శ్రీనివాస్, ఇల్లా కోదండరావు, తదితరులు పాల్గొన్నారు.

- పాతపట్నం: తెంబూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆటపాటలతో గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు బోడ అప్పారావు, వీరస్వామిరెడ్డి, చంద్రరావు, ఎంఈవో కిల్లారి రాంబాబు తెంబూరు ఉపసర్పంచ్ యర్ర ఈశ్వరరావు, హైస్కూల్ వైస్‌చైర్మన్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.